# రూ.11కోట్లతో సిద్దిపేట క్రీడాకాంప్లెక్స్ అభివృద్ధి




క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- **క్రీడాహబ్‌గా సిద్దిపేట**
- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**
- **సిద్దిపేట ఫుట్‌బాల్ స్టేడియంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం**

సిద్దిపేట, డిసెంబర్ 28: సిద్దిపేట పట్టణంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో 16 రకాల క్రీడలకు సంబంధించిన మైదానాలు, కోర్టులు, సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు అతిథ్యం ఇవ్వడం జరిగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని ఫుట్‌బాల్ స్టేడియంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సిద్దిపేట ఫుట్‌బాల్ స్టేడియం అద్భుతంగా చేసుకున్నామని, రూ.11కోట్లతో క్రీడా కాంప్లెక్స్ అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ ప్రదర్శించి జాతీయస్థాయిలో రాణించాలన్నారు. సిద్దిపేట, రాష్ట్రం, దేశానికి మం చి పేరు తేవాలని క్రీడాకారులకు సూచించారు. ప్రతి ఒక్కరికీ చదువు ఎంత ముఖ్యమో క్రీడలు అంతే ముఖ్యమన్నారు. విద్యతోపాటు క్రీడల్లో పోటీ తత్వం అలవర్చుకోవాలన్నారు. పాఠశాలల స్థాయికే పరిమితమైన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు పంపేలా సిద్దిపేటలో అన్నిరకాల క్రీడాసౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. స్విమ్మింగ్‌పూల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్ సెలెక్షన్స్, రంగనాయకసాగర్ వద్ద జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు సిద్దిపేట వేదికైందన్నారు. నేడు సిద్దిపేట స్పోర్ట్స్ హబ్‌గా మారిందన్నారు, ఫ్లడ్ లైట్ల వెలుగులతో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. క్రికెట్ స్టేడియాన్ని రూ.4కోట్లతో అభివృద్ధి చేయబోతున్నట్లు తెలిపారు. రూ.5 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసుకున్నామని, స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటు చేయబోతున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. ఇప్పటికే రూ.50లక్షలతో వాలీబాల్ స్టేడియాన్ని తయారు చేసుకున్నామని, రూ. 50లక్షలతో స్టేడియాన్ని మరింత ఆధునీకరించనున్నట్లు తెలిపారు. రూ.2కోట్లతో ఫుట్‌బాల్ స్టేడియాన్ని అద్భుతంగా తయారు చేసుకొని అందుబాటులో తెచ్చామన్నారు. ఇటీవల జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై జమూకశ్మీర్‌లో ఆడిన అబ్దుల్ సమద్‌ను, రాష్ట్రస్థాయిలో ఎంపికైన శివగణేశ్‌ను అభిందించారు. కార్యక్రమంలో సాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాలసాయిరామ్, ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు అక్బర్, వివిధ క్రీడా అసోసియేషన్ల బాధ్యులు మల్లికార్జున్, హరీశ్ పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు



సిద్దిపేట ఫెడరల్ బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## విద్య, వ్యాపార కేంద్రంగా సిద్దిపేట

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు... సిద్దిపేటలో ఫెడరల్ బ్యాంక్ ప్రారంభం**

సిద్దిపేట, డిసెంబర్ 28: సిద్దిపేట నేడు విద్య, వైద్యం సాగునీరు, వ్యాపార వాణిజ్య కేంద్రంగా మారిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఫెడరల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెడరల్ బ్యాంక్ సిద్దిపేటకు రావడం శుభసూచకమన్నారు. సిద్దిపేటలో అన్ని బ్యాంకులు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాలో 144 బ్రాంచీలు, 32 రకాల బ్యాంక్‌లు ప్రజలకు సేవలు అందిస్తున్నాయన్నారు. పట్టణంలోనే వివిధ బ్యాంక్‌లకు చెందిన 50 బ్రాంచీలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రూ.12 వేల కోట్ల వ్యాపారంతో సిద్దిపేట రూ.7కోట్ల వరకు బ్యాంక్ లోన్స్, రూ.5కోట్ల వరకు డిపాజిట్లు ఉన్నాయన్నారు. ఎస్‌బీఐ 7 బ్రాంచీలు, యూబీఐ 7 బ్రాంచీలు వచ్చాయన్నారు. అంతకుముందు సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ కూతురు నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. సిద్దిపేట బైపాస్ రోడ్డు హరీశ్‌రావునగర్‌లో గల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నవగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు నిర్వహించారు.



లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో నవగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



దరఖాస్తులను స్వీకరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

## ప్రజా సంక్షేమానికే ఆరు గ్యారెంటీలు

- **అర్హులందరికీ వర్తింపజేస్తాం**
- **వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

అల్లాదుర్గం, డిసెంబర్ 28 : ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మండలంలోని రాంపూర్‌లో బుధవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి క్షేత్రస్థాయిలో ఆదర్శవంతమైన మార్పును తీసుకురావాలని సూచించారు. ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. 161వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కూల్చివేసిన ప్రభుత్వ భవనాలను త్వరలో నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, డీపీవో సాయిబాబా, ఆర్డీవో అంబదాస్, జిల్లా వైద్యాధికారి చందూనాయక్, జిల్లా ప్రత్యేకాధికారి శారద, జడ్పీటీసీ సౌందర్య, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ సతీశ్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేషారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు సుభాశ్‌రావు, బలరాం, బాలకిషన్, శేఖర్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు




అందోల్: సంగుపేటగ్‌లో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ



చౌటకూర్‌లో దరఖాస్తులు స్వీకరించి రసీదు అందజేస్తున్న మంత్రి

- **వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**
- **సంగారెడ్డి జల్లా అల్మాయిపేట్, సంగుపేట్ గ్రామాల్లో ప్రజాపాలన ప్రారంభం**

అందోల్, డిసెంబర్ 28: రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం మండలంలోని అల్మాయిపేట్, సంగుపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పథకాన్ని ప్రారంభించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని తెలిపారు. అధికారులు, పార్టీ నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ శరత్, ఆర్డీవో పాండు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, మండల ప్రత్యేకాధికారిణి గీత, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

**ఇది నిరంతర ప్రక్రియ:**

చౌటకూర్, డిసెంబర్ 28: ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాతనే అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మండలంలోని శివంపేట గ్రామంలో గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, కలెక్టర్ శరత్, ఎంపీపీ పట్లోళ్ల చైతన్యవిజయభాస్కర్‌రెడ్డితో జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ నితరంతర ప్రక్రియ అన్నారు. అనంతరం వెంకటకిష్టాపూర్ గ్రామంలోని శ్రీరుక్మిణీ పాండురంగస్వామిని మంత్రి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, ఆర్డీవో పాండు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపాలన ప్రారంభం:**

సంగారెడ్డి, డిసెంబర్ 28: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డిలోని ఆయా వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలనలో మంత్రి పాల్గొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీరవి, కలెక్టర్ శరత్‌కుమార్, ఎస్పీ చెన్నూరి రూపేశ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎంపీపీ లావణ్య, కమిషనర్ సుజాత, డీఈఈ ఇంతియాజ్, టీపీవో కరుణాకర్‌తోపాటు వార్డు మహిళలు పాల్గొన్నారు.